సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

గురువారం । 17 । ఏప్రిల్ । 2025



రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

కడప–చిత్తూరు జాతీయ రహదారిపై బుగ్గలే టిపల్లె గ్రామం వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు యువకులు మృతి చెందారు. -8లో



మహిళలు, చిన్నారుల రక్షణకు శక్తి

మహిళలు, చిన్నారుల భద్రతే లక్ష్యంగా ప్రత్యేకంగా శక్తి బృందాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ ఈ.జి. అశోక్ కుమార్ తెలిపారు. -8లో

గరిష్టం/కనిష్టం
40.2/25.5

వాతావరణం

జిల్లాలో బుధవారం 25.5 – 40.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

21న ప్రభుత్వ పురుషుల కళాశాలలో జాబ్ ఫెస్ట్

కడప ఎడ్యుకేషన్: కడప ప్రభుత్వ పురుషుల కళాశాల, కడప ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలు సంయుక్తంగా ఈ నెల 21న ఏపీ ఎస్ ఎస్ డీసీ సౌజన్యంతో కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో (స్వయంప్రతిపత్తి) జవహర్ నాలెడ్జ్ సెంటర్ (జెకేసీ) ఆధ్వర్యంలో జాబ్ ఫెస్ట్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.జి.రవీంద్రనాథ్ తెలిపారు. కడప జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఎయిడెడ్ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని తెలియజేశారు. ఈ జాబ్ ఫెస్టులో సుమారు 21 కంపెనీలు పాల్గొంటారని వెయ్యి మందికి పైగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలియజేశారు. ఈ జాబ్ డ్రైవ్లో పాల్గొనదలచిన అభ్యర్థులు బయోడేటా/రెస్యూమ్/ఆధార్‌తోపాటు సర్టిఫికేట్ల జిరాక్సు ప్రతులతో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు కళాశాలలోని జేకేసీ మెంటార్లు డాక్టర్ ఎస్.సారథి (9347256400) లేదా సీవీ. రవీంద్రారెడ్డి (9390052901)లను సంప్రదించాలని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి



ఎంపీడీఓలతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్

కడప సెవెన్ రోడ్స్: మండల స్థాయిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని జెడ్పీ చైర్మన్ రామగోవిందరెడ్డి అన్నారు. బుధవారం జెడ్పీలో జిల్లాలోని ఎంపీడీఓలతో నిర్వహించిన సమావేశంలో మండలాల వారీగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మెన్ పిట్టు బాలయ్య, జెడ్పీ సీఈవో ఓబులమ్మ, జిల్లా పరిషత్ ఏవోలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓలు జెడ్పీ చైర్మెన్‌ను ఘనంగా సత్కరించారు.

డాక్టర్ సుధాకర్‌రెడ్డికి అరుదైన గౌరవం



రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ ఫెలో సర్టిఫికెట్ అందుకుంటున్న ఆచార్య బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల భౌతికశాస్త్ర ఆచార్యులు, శాస్త్రవేత్త ఆచార్య బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డికి మరోసారి అరుదైన గౌరవం లభించింది. ప్రపంచవ్యాప్తంగా 50వేల మంది సభ్యులుగా ఉండే రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీలో ఫెలోగా అవకాశం దక్కించుకున్న ఈయన తాజాగా సొసైటీ వారు మెటీరియల్ కెమిస్ట్రీ, ఫిజిక్స్ విభాగాల్లో చేసిన ప్రతిభను గుర్తించి ఎఫ్ఆర్ఎస్‌సీ (ఫెలో ఆఫ్ ది రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ) అందించారు. దీనికి సంబంధించిన సర్టిఫికెట్‌ను, అదే విధంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే 'రాయల్ సొసైటీ బ్యాడ్జి'ను బుసిరెడ్డికి పంపారు. బుధవారం కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ ఎంతో గౌరవంగా భావించే బ్యాడ్జిని డా. బుసిరెడ్డికి తగిలించడంతో పాటు సర్టిఫికెట్‌ను అందించి అభినందించారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయం



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సురేష్‌బాబు

సిద్దవటం: ప్రజల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించాలని రాష్ట్ర ప్రాజెక్టు మేనేజర్ సురేష్‌బాబు తెలిపారు. సిద్దవటంలోని వెలుగు కార్యాలయంలో బుధవారం వ్యవసాయ సహాయకులకు ప్రకృతి వ్యవసాయంపై ఒక్కరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని టక్కోలు, మాచుపల్లె గ్రామాల్లోని రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారన్నారు. ప్రస్తుతం మనం తినే ఆహారం అంతా విషపూరితమే అని అన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల ఆరోగ్యవంతంగా ఉండవచ్చని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంపై మహిళా సమాఖ్యలతో భాగస్వామ్యం , ఒప్పందం కుదుర్చుకున్నట్లు చెప్పారు. రైతు సాధికార సంస్థ.. స్వయం సహాయక సంఘాలు, గ్రామ సమాఖ్య సంఘాలతో సంప్రదించి ప్రకృతి వ్యవసాయాన్ని అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎస్.వి. ప్రవీణ్, అదనపు ప్రాజెక్టు మేనేజర్ వసంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

నిద్దరోతున్న నిఘా!

- అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా జిల్లా కేంద్రం
- అక్రమ ఆదాయం కోసం అర్రులు చాస్తున్న క్షేత్రస్థాయి అధికారులు
- నడిరోడ్డుపై గొంతుకోస్తున్నా అడ్డుకునే దిక్కేలేదు
- హైలెవెల్ సిఫార్సులు సైతం తొక్కి పెడుతున్న డబుల్, త్రిబుల్ స్టార్ అధికారులు




సాక్షి ప్రతినిధి, కడప: జిల్లా కేంద్రం అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది. నిఘా వైఫల్యం అడుగడుగునా తాండవిస్తోంది. నడిరోడ్డుపై గొంతు కోస్తున్న అడ్డుకునే దిక్కేలేకుండా పోయింది. చిన్న అవకాశం దొరికితే లక్షలాది రూపాయాలు దండుకోవాలనే తపనే క్షేత్రస్థాయి అధికారుల్లో ఎక్కువగా కన్పిస్తోంది. ప్రతి చిన్న విషయంలో రాజకీయ పెత్తనం అధికంగా ఉండడంతో ఖాకీ కరుకు తగ్గింది. ప్రజల ధన, మాన, ప్రాణాలను కాపాడాల్సిన పోలీసుశాఖ నిర్లక్ష్యపు నిద్దురలో..అవినీతి మత్తులో జోగుతోంది.

- ఎస్పీగా ఈజీ అశోక్‌కుమార్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఒక్క ఫోన్ కొడితే చాలు న్యాయం చేస్తామని ప్రకటించడంతో జిల్లా వాసులు సంతోష పడ్డారు. అనతి కాలంలోనే ఆ సంతోష క్షణాలు తీరిపోయాయి. ఎస్పీ ప్రకటనలకు ధీటుగా క్షేత్రస్థాయిలో పోలీసు అధికారుల పనితీరు కనబర్చడం లేదు. అధికార పార్టీ మెప్పు పొందడమే ధ్యేయం అన్నట్లుగా కొందరు వ్యవహరిస్తున్నారు. సోషల్ మీడియాలో చిన్న పోస్టు పెడితే అరెస్టుల వరకూ వెళ్తున్న యంత్రాంగం ప్రజాస్వామ్యం పరిరక్షణలో ఆ స్థాయిలో పనితీరు, ప్రతిభ కనబర్చలేదనే విమర్శలు బలంగా విన్పిస్తున్నాయి. మరోవైపు అక్రమ ఆదాయం కోసం కొంత మంది డబుల్, ట్రిపుల్ స్టార్ అధికారులు అర్రులు చాస్తున్నారు.

హవాలా బంగారం పట్టుబడితే...

జిల్లా కేంద్రంలో హవాలా బంగారం భారీగా పట్టుబడినట్లు సమాచారం. ఒక డబుల్ స్టార్, మరొక ట్రిపుల్ స్టార్ అధికారి ఈ వ్యవహారంలో భారీ మొత్తంలో సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలున్నాయి. విషయం పసిగట్టిన కానిస్టేబుళ్లు నలుగురికి వేలల్లో ముట్టజెప్పి, ఆ ఇద్దరు అధికారులు లక్షల్లో నొక్కేసినట్లు విస్తృత స్థాయిలో ప్రచారం ఉంది. కాగా ఈవ్యవహారం ఎక్కడా బహిర్గతం కాకుండా జిల్లా పోలీసుశాఖ తొక్కి పెట్టినట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. మరోవైపు త్రిబుల్ సీ ఫిర్యాదుల పరిష్కారానికి ఉన్నతాధికారులు సిఫార్సులు చేసినా క్షేత్రస్థాయిలో నిష్ప్రయోజనమే అవుతున్నట్లు పలువురు వాపోతున్నారు. క్షేత్రస్థాయిలో అధికారులకు నచ్చితే ఒకరకంగా.. నచ్చకపోతే మరోరకంగా వ్యవహరిస్తోన్నట్లు తెలుస్తోంది. ప్రముఖ వ్యాపారి వ్యవహారం ఇటీవల దుమారం రేపుతోంది. బాధితుడిగా ఉన్న వ్యాపారిని మభ్య పెట్టి వైరిపక్షంలో భారీ స్థాయిలో దండుకొని ఆ వ్యవహారాన్ని క్షేత్రస్థాయి అధికారులు నీరుగార్చినట్లు సమాచారం. ఆపై సదరు వ్యాపారి డీఐజీ స్థాయికి వ్యవహారాన్ని తీసుకెళ్లడం, స్వయంగా డీఐజీ రంగప్రవేశం చేయడంతో కొంత ఉపశమనం దొరికినట్లు తెలుస్తోంది. న్యాయం, అన్యాయం అనే విచక్షణ లేకుండా కొంతమంది అధికారులు వ్యవహరిస్తోన్న ధోరణే పోలీసు శాఖకు ప్రధాన మచ్చగా నిలుస్తోన్నట్లు పలువురు చెప్పుకొస్తున్నారు.



నిఘా వైఫల్యం...

జిల్లా కేంద్రంలో నిఘా వర్గాలు ఆశించిన స్థాయిలో పనితీరు కనబర్చలేదనే ఆరోపణలు లేకపోలేదు. బిల్టప్ సమీపంలో మంగళవారం తెరపైకి వచ్చిన సాదిక్‌వలీ హత్య అందుకు ప్రత్యక్ష నిదర్శనంగా పలువురు చెప్పుకొస్తున్నారు. హత్య కేసులో నిందితుడుగా ఉన్న సాదిక్‌వలి బెయిల్‌పై విడుదల తర్వాత పోలీసుల నుంచి హెచ్చరికలు లేనట్లు తెలుస్తోంది. వెరసి అదే ప్రాంతంలో సాదిక్ యధేచ్ఛగా సంచరిస్తున్న వైనాన్ని ప్రత్యర్థులు పసిగట్టారు. మాటువేసి అత్యంత పాశవికంగా మట్టుబెట్టారు. నడిరోడ్డుపై గొంతుకోస్తున్న నిలువరించే పరిస్థితి లేదు. ఇంకోవైపు పోలీసు పెట్రోలింగ్ పేరుకు మాత్రమే అన్నట్లుగా ఉండిపోయింది. పోలీసు పెట్రోలింగ్ మరింత పటిష్టంగా చేపట్టాల్సిన అవసరం లేకపోలేదు. పోలీసుశాఖ పటిష్టంగా ఉంటే ప్రజలకు శ్రేయష్కరం. ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఒక్క ఫోన్ కొడితే న్యాయం చేస్తామని ప్రకటనకు తగ్గట్లుగా క్షేత్రస్థాయిలో సిబ్బంది సైతం స్వీయ నియంత్రణతో విధులు చేపట్టాలని ప్రజాస్వామ్యవాదులు భావిస్తున్నారు. ఇకనైనా పోలీసు ప్రతిష్ట పెంచే చర్యలు డబుల్, ట్రిపుల్ స్టార్ అధికారులు చేపట్టాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

పదోన్నతికి.. వైకల్యం!

అడ్డదారిలో ప్రమోషన్ పొందడానికి సులువైన మార్గం 'అంగ వైకల్యం'. అందులోనూ 'చెవుడు'ఉన్నటుగ్లా ఎలాగో ఒకలా దొంగ సర్టిఫికెట్‌ను సంపాదిస్తే, పదోన్నతిని ఇట్టే పట్టొచ్చు.అనుకున్న సీటును కబ్జా చేసి, పాగా వేయొచ్చు... ఇదీ వైద్య ఆరోగ్యశాఖలోని కొందరి ఉద్యోగుల తీరు. ఉద్యోగులు చేస్తున్న ఈ అడ్డదారి ప్రయత్నాలు వైద్య ఆరోగ్య శాఖ (జోన్–4) ప్రాంతీయ కార్యాలయం పరిధిలో చర్చనీయాంశంగా మారాయి.



వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం

కడప రూరల్: కడప వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయంలో పనిచేయడానికి, జోన్–4 పరిధిలోని రాయలసీమ జిల్లాల్లో పనిచేసే దాదాపుగా ప్రతి ఉద్యోగి ఆసక్తిని ప్రదర్శిస్తారు. ఈ శాఖ కీలకమైనందున ఇక్కడ పనిచేయడానికి ఉద్యోగుల మధ్య తీవ్ర పోటీ ఉంటుంది. ఈ సందర్భంగా జరిగే కొన్ని సంఘటనలు తీవ్ర చర్చకు కారణమవుతున్నాయి.

పక్కాగా ప్రణాళిక... చాలా మంది ఉద్యోగులు అవకాశం దొరికితే ఈ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సూపరిండెంట్‌గా పని చేయడానికి ఉబలాటపడుతుంటారు. తిరుపతి వైద్య ఆరోగ్య శాఖకు చెందిన, ఒక విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఒక ఉద్యోగి ఎప్పటి నుంచో ఇక్కడికి రావడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. 2023లో వైద్య ఆరోగ్య శాఖలో పనిచేసే ఉద్యోగులకు సాధారణ బదిలీలు నిర్వహించారు. అప్పుడు ఆ ఉద్యోగి ఎలాగైనా సరే ఈ కార్యాలయానికి ట్రాన్స్‌ఫర్ కావాలని, ఈఎన్‌టీ డాక్టర్ నుంచి తెచ్చిన చెవుడు సర్టిఫికెట్‌ను సమర్పించారు. ఈ విషయమై అప్పట్లోనే పలు ఆరోపణలు వచ్చాయి. దీంతో అప్పటి ఆ శాఖ రీజనల్ డైరెక్టర్, ఈఎన్‌టీ వైద్యుడి ఇచ్చిన చెవుడు సర్టిఫికెట్ చెల్లదని నిరాకరించారు. తాజాగా ఈ కార్యాలయంలో రెండు ఆఫీస్ సూపరింటెండెంట్ పోస్టులు ఉన్నాయి. ఒక విభాగానికి ఆఫీస్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న గోపాల్‌రెడ్డి వచ్చే నెలలో ఉద్యోగ విరమణ పొందనున్నారు. దీంతో ఈ పోస్ట్‌పై కొందరి దృష్టి పడింది. ఇక్కడికి పదోన్నతిపై ఆఫీస్ సూపరింటెండెంట్‌గా రావడానికి కొందరు ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో తిరుపతిలో పనిచేసే ఉద్యోగి ఒకరు. అతను ఇంతకు ముందులా కాకుండా ఈ సారి ఏకంగా అంగ వైకల్యంను నిర్ధారించే 'సదరం'నుంచే చెవుడు ఉన్నట్లుగా సర్టిఫికెట్ పొందినట్లు సమాచారం.

అర్హులకు అన్యాయమే!

నిబంధనల మేరకు ఉద్యోగి సీనియారిటీ ఇతర సర్వీసు అంశాల ప్రకారం ప్రమోషన్ కల్పిస్తారు. అప్పుడు ఆశావహులైన ఉద్యోగులకు అనుకున్న సీటులో కూర్చోవడానికి వీలుపడదు. అదే 'చెవుడు'లాంటి అంగ వైకల్యం సర్టిఫికెట్‌ను పొందితే, కేటగిరీకి చెందిన ఉద్యోగులకు పదోన్నతుల్లో ప్రాధాన్యత ఉంటుంది. ఆ ప్రకారం అయితే తిరుపతిలో పనిచేస్తున్న ఉద్యోగికి 'చెవుడు'సర్టిఫికెట్ ఉన్నందున, ఆ వ్యక్తికే ఆఫీస్ సూపరింటెండెంట్‌గా పదోన్నతి లభించే అవకాశం ఉంటుంది. అదే జరిగితే అర్హులకు అన్యాయం జరుగుతుందనే వాదన వినిపిస్తోంది. నిజంగా చెవుడు ఉండి ప్రమోషన్ పొందితే నష్టం లేదు. బోగస్‌లాంటి సర్టిఫికెట్స్‌తో పదోన్నతి చేపడితే అర్హులకు అన్యాయం జరిగినట్లే కదా..? అనే ప్రశ్నలు ఆ శాఖ ఉద్యోగుల్లో తలెత్తుతున్నాయి. కాగా త్వరలో జరిగే ప్రమోషన్స్ కౌన్సెలింగ్‌లో ఈ అంశం హాట్ టాపిక్‌గా మారే అవకాశం ఉంది. అర్హులైన ఉద్యోగులకు న్యాయం జరిగేలా అటు ఉన్నతాధికారులు..ఇటు ఉద్యోగ సంఘాల నేతలు చర్యలు తీసుకోవాలని ఆ శాఖకు చెందిన ఉద్యోగులు కోరుతున్నారు.

విద్యార్థులు గొప్పవారి చరిత్రను చదవాలి

వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య పద్మ



మాట్లాడుతున్న వైవీయూ రిజిస్ట్రార్ పుత్తా పద్మ

కడప ఎడ్యుకేషన్ : విద్యార్థి దశలో గొప్ప వారి చరిత్రలు చదివి వారి ఆదర్శనీయమైన ఆలోచనలను అనుసరించాలని యోగి వేమన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పుత్తా పద్మ అన్నారు. కందుకూరి వీరేశలింగం జయంతి సందర్భంగా వైవీయూ లలిత కళల శాఖలో బుధవారం నాటక రంగ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్‌తోపాటు డీన్ కె.గంగయ్య, శాఖ హెడ్ కె.మృత్యుంజయరావు కందుకూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పుత్తా పద్మ మాట్లాడుతూ కందుకూరి వీరేశలింగం బాల్య వివాహాలను నిషేధించడం, వితంతు వివాహాలను ప్రోత్సహించడంతోపాటు బాలికల విద్య కోసం కృషిచేసిన మహానుభావుడు అని వివరించారు. హిస్టరీ అండ్ ఆర్కియాలజీ ప్రొఫెసర్, ఆర్ట్స్ అండ్ హ్యుమానిటీస్ డీన్ ప్రొఫెసర్ కె.గంగయ్య మాట్లాడుతూ దేశ సంస్కృతిని కాపాడేవి నాటకాలేనని తెలిపారు. ఫైన్ ఆర్ట్స్ డిపార్ట్‌మెంట్ హెచ్ఓడీ డాక్టర్ కె.మృత్యుంజయ రావు మాట్లాడుతూ నాటకాలు సమాజాన్ని ప్రభావితం చేస్తాయని, ఒక మంచి మార్గంలో తీసుకువెళ్తాయని తెలిపారు. అనంతరం నాటక రంగంలో నంది అవార్డులు, హంస అవార్డులు, కందుకూరి పురస్కారాలు అందుకున్న రంగస్థల కళాకారులు, నటులు అయిన కొడవలూరు చంద్రశేఖర్ రాజు, ఎడవల్లి కృష్ణమూర్తి,పి.యశోద, డా. నీలం బాలగంగాధర్ తిలక్‌ను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. డాక్టర్ కొప్పోలు రెడ్డిశేఖర్‌రెడ్డి, సీహెచ్. వెంకటేష్, బి.చినరాయుడు, బి.వీరప్ప, ఎం.వాసవి, చంటిసూరి, సిద్ధిరాజ్ పాల్గొన్నారు.

18న జిల్లా అంజుమన్ తరక్కి సమావేశం

కడప ఎడ్యుకేషన్ : అంజుమన్ తరక్కి ఉర్దూ జిల్లా శాఖ కార్యవర్గ సభ్యుల సమావేశం శుక్రవారం సాయంత్రం ఏడు గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్తార్ ఫైజి, హిదయతుల్లా ఓ ప్రకటనలో తెలిపారు. కడప రహమతుల్లా వీధి లోని ఖామి టూర్స్ అండ్ ట్రావెల్స్‌లో జరిగే ఈ సమావేశంలో ఇప్పటివరకూ జరిగిన కార్యక్రమాలపై సమీక్షతో పాటు, ఉర్దూ సమ్మర్ క్యాంపుపై చర్చ జరుగుతోందని తెలిపారు. జిల్లాలోని అంజుమన్ తరక్కి ఉర్దూ శాఖ కార్యవర్గ సభ్యులందరూ పాల్గొనాలని కోరారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



రెవెన్యూ అధికారులకు నిర్వహించిన వర్క్ షాప్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

కడప సెవెన్ రోడ్స్: రెవెన్యూ అధికారులు అన్నిరకాల జీవోలు, చట్టాలపై అవగాహన పెంచుకుని.. తమ పనితీరు మెరుగుపరచుకొని బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ లోని సభా భవన్ లో కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల రెవెన్యూ డివిజన్ల పరిధిలోని తహసీల్దార్లు, డీటీలు, వీఆర్వో, మండల సర్వేయర్ల తో వివిధ రకాల రెవెన్యూ అంశాలపై ఒకరోజు శిక్షణా కార్యక్రమం (వర్క్ షాప్) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సేవలలో వేగం, నాణ్యత, పారదర్శకత ముఖ్యమన్నారు. ప్రజలతో కలిసి మెలిసి మమేకం కావాలని, చట్ట ప్రకారం మార్గదర్శకాలు మేరకు పని చేయాలని సూచించారు. వ్యవస్థలో లోపాలు సరిదిద్దుకొని ముందుకు వెళ్లగలిగినప్పుడే శాఖకు మంచి పేరు వస్తుందని అన్నారు. పిజిఆర్ఎస్ ద్వారా అందిన దరఖాస్తులను ఆయా గ్రామాల వారిగా క్రోడీకరించుకోవాలని సూచించారు. ప్రతి వారం పిజిఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారం పై ముఖ్యమంత్రి కార్యాలయం సమీక్ష చేస్తోందన్నారు. అత్యంత ప్రాధాన్యత కలిగిన ఈ కార్యక్రమంలో ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించడమే మన బాధ్యత అని తెలియజేశారు. సమస్యల పరిష్కారంలో తీవ్ర జాప్యం చేయడం, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. భూముల అంశంలో నిబంధనలను దష్టిలో ఉంచుకొని క్షేత్రస్థాయిలో పారదర్శకంగా విచారణ చేసి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. అసైన్డ్ భూములు, ఆర్ఓఆర్, పట్టాదారు పాస్ పుస్తకాలు, చట్టాలు తదితర అంశాలపై అవగాహన కలిగి పని చేయాలన్నారు.

లక్ష్యాల సాధనకు బ్యాంకర్లు సహకరించాలి

కడప సెవెన్ రోడ్స్: ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనకు బ్యాంకర్లు సహకరించాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రత్యేక డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అర్హులైన నిరుద్యోగులకు వివిధ రకాల సెక్టార్ల ద్వారా ఉపాధి అవకాశాలను కల్పించేందుకు సబ్సిడీ రుణాలను అందిస్తోందన్నారు. అందులో భాగంగా పరిశ్రమల రంగం, ట్రాన్స్‌పోర్ట్ సెక్టార్, వ్యవసాయ రంగం విభాగాలలో 828 యూనిట్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 29న కడప హార్టికల్చర్ కాంక్లేవ్ నిర్వహిస్తున్నట్లు ఇందులో బ్యాంకర్లు పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో ముందుగా డీసీసీ సమావేశానికి సంబంధించిన అజెండా, వివరాలను ఎల్‌డీఎం మేనేజర్ జనార్దనం వివరించగా..అనంతరం ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మి ఎస్సీ కార్పొరేషన్ కు సంబంధించి అజెండా వివరాలను కలెక్టర్ కి వివరించారు.

'కూటమి'ది మోసపూరిత పాలన

కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని సన్మానిస్తున్న ముస్లిం మైనార్టీ నాయకులు, తదితరులు

పులివెందుల: అధికారంలోని కూటమి ప్రభుత్వం ప్రజలను నిలువునా మోసం చేస్తోందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి విమర్శించారు. బుధవారం ఉదయం ఆయన పులివెందులలోని తన స్వగృహంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 ఎన్నికలప్పుడు అధికారంలోకి రావడానికి కూటమి ప్రభుత్వం అనేక అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. సూపర్ సిక్స్ పథకాలంటూ కూటమి నాయకులు చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్‌లతో సహా ఇతర నాయకులు ఊదరగొట్టారని గుర్తు చేశారు. పథకాల అమలుకు రాష్ట్ర బడ్జెట్‌కు మించిన పని అని నిపుణులు ప్రశ్నించగా, సంపద సృష్టిస్తామని బీరాలు పలికారని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసెంబ్లీ సాక్షిగా సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలంటే కష్టతరమని ప్రకటించి మోసానికి దిగారని మండిపడ్డారు. చంద్రబాబు నాయుడు అధికారం కోసం ఎంతటి దిగజారుడు రాజకీయాలు చేస్తాడో అందరికి తెలిసిన విషయమేనన్నారు. చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేంతవరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజల తరఫున పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. అనంతరం ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.

ఎంపీని సన్మానించిన ముస్లిం సోదరులు

బుధవారం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని పట్టణంలోని ముస్లిం సోదరులు కలిశారు. ఈ సందర్భంగా వారు వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఎంపీని సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ వారితో మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తమ పార్టీ ఎంపీలు పార్లమెంటు, రాజ్యసభలో వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేశారన్నారు. కూటమి ప్రభుత్వం తాము చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు వైఎస్సార్‌సీపీపై ఎల్లో మీడియా ద్వారా విషపు రాతలు రాస్తోందని ధ్వజమెత్తారు. ముస్లిం మైనార్టీ నాయకులు రసూల్, నూరుల్లా, ఖాదర్, మసీదుల ప్రెసిడెంట్లు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం అందివ్వాలి: ఈదురు గాలులు, వడగండ్ల వానతో పంట నష్టం జరిగిన అరటి రైతులు ఎంపీని కలిశారు. ఈ సందర్భంగా వారు ఎంపీతో తమ ఆవేదన వ్యక్తం చేశారు. అప్పట్లో టీడీపీ నాయకులు, రాష్ట్ర మంత్రి పర్యటించి వెంటనే నష్టపరిహారం అందిస్తామని చెప్పారని, ఇప్పటికీ నష్టపరిహారం అందలేదని, ఇంతలో మరోసారి ప్రకృతి ప్రకోపానికి పంట నష్టం జరిగిందని మొర పెట్టుకున్నారు. దీనికి ఎంపీ స్పందిస్తూ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళతానని నష్టపరిహారం అందివ్వకుంటే పార్టీ తరఫున ఆందోళనలు చేపడతామని వారికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో రైతులు శేఖరరెడ్డి, బలరామిరెడ్డి, అంబకపల్లె బాబు, తదితరులు ఉన్నారు.

గాలివాన బీభత్సం

- 110 ఎకరాల్లో అరటిచెట్లు ధ్వంసం
- మూడు కోట్ల పంట నష్టం

ఓబులవారిపల్లె: చేతికి అందిన పంట గాలివానకు నేలమట్టం కావడంతో అరటి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో మంగళవారం రాత్రి మోస్తరు భారీ వర్షం కురిసింది. దీనికితోడు గాలులు వీయడంతో బాలిరెడ్డిపల్లి, వైకోట, చెన్నరాజుపోడు గ్రామాల్లో అరటి, మామిడి చెట్లు నేలకొరిగాయి. వందల ఎకరాల్లో మామిడి కాయలు నేలరాలాయి. రాలిపోయిన మామిడి కాయలు పనికిరాకుండా పోయాయి. సంవత్సరాలపాటు పెంచిన మామిడి చెట్లు వేర్లతోసహా పడిపోవడంతో రైతులకు తీరని నష్టం వాటిల్లింది. దాదాపు 110 ఎకరాల్లో కోత దశలో ఉన్న అరటిచెట్లు నేలవాలాయి. దీంతో రైతులకు దాదాపు మూడుకోట్ల రూపాయల పంట నష్టం వాటిల్లింది. వైకోట, చెన్నరాజుపోడు, గ్రామాల్లో నేలకొరిగిన అరటి, మామిడి చెట్లను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పరిశీలించారు. పంటనష్టం నమోదు చేయించి రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు. మండల ఉద్యానశాఖాధికారి భాస్కర్ దెబ్బతిన్న మామిడి, అరటి రైతుల వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు.



వైకోట గ్రామంలో గాలివానకు దెబ్బతిన్న అరటిచెట్లు

క్లుప్తంగా

పోలీసుల అదుపులో హత్య కేసు నిందితులు?

– ఐదుగురిపై ఫిర్యాదు, కేసు నమోదు

కడప అర్బన్ : కడప తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో బిల్టప్ సర్కిల్ వద్ద పులివెందుల రోడ్డులో మద్యం దుకాణం వద్ద అత్యంత కిరాతకంగా సాదిక్ వలి(30) అనే వ్యక్తిని మరియాపురానికి చెందిన రాయప్ప అలియాస్ పెద్దోడు కత్తితో గొంతు కోసి దారుణంగా హత్య చేశాడు. ఈ సంఘటనపై పోలీసులు ఇప్పటికే సీసీ ఫుటేజీలను సేకరించారు. హత్య చేసిన వారిలో రాయప్పతో పాటు, కాలియా, బాలస్వామి అలియాస్ బాలదాసులు, మరో ఇద్దరు ఉన్నట్లు సాదిక్‌వలీ భార్య యాస్మిన్ ఫిర్యాదు చేశారు. ఈమేరకు కడప తాలూకా సీఐ వెంకటేశ్వర్లు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మరోవైపు ప్రత్యేక పోలీసు బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ హత్య కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

మహిళపై దాడి

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని మాలెపాడు గ్రామానికి చెందిన కుప్పన్నగారి సుబ్బమ్మపై భూమి సమస్య విషయమై కె.క్రిష్టారెడ్డి అనే వ్యక్తి దాడి చేసి బెదిరించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కలమల్ల పోలీసులు బుధవారం తెలిపారు. సుబ్బమ్మ, క్రిష్టారెడ్డిల మధ్య భూ విషయంపై సమస్య ఉంది. సుబ్బమ్మ భర్త ఉపిరెడ్డి చాలా సంవత్సరాల క్రితమే మృతి చెందాడు. ఇంటిలో సుబ్బమ్మ ఒంటరిగా ఉంటోంది. అయితే భూ సమస్య విషయంపై సుబ్బమ్మ ఇంటిపై క్రిష్టారెడ్డి దాడి చేసి బెదిరించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాళ్లమాపురంలో చోరీ యత్నం

– అడ్డు వచ్చిన యువతిపై దాడి చేసిన దుండగులు

ప్రొద్దుటూరు క్రైం : మండల పరిధిలోని తాళ్లమాపురం గ్రామంలో దుండగులు ఓ ఇంట్లో చోరీ యత్నం చేశారు. అయితే దుండగుల అలికిడిని గ్రహించి కుటుంబ సభ్యులు నిద్రలేవడంతో వారు పారిపోయారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తాళ్లమాపురం గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి కిరాణా షాపు నిర్వహిస్తుంటాడు. కుటుంబ సభ్యులతో కలిసి అతను ప్రతిరోజు రాత్రి ఆరుబయట పడుకుంటాడు. ఈ క్రమంలో బుధవారం అర్ధ రాత్రి 1 గంట సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వారి ఇంటి ప్రహరీ దూకారు. అక్కడే ఉన్న కుక్క వారిని చూసి మొరగడంతో సుబ్బారెడ్డి కుమార్తె వెంకటలక్ష్మి నిద్ర లేచింది. దుండగులను చూసి ఆమె దొంగా దొంగా అంటూ గట్టిగా కేకలు వేసింది. దీంతో దుండగులు అక్కడే ఉన్న కట్టె తీసుకొని ఆమె తలపై కొట్టి పారిపోయారు. రూరల్ ఎస్ఐ అరుణ్‌రెడ్డి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. గాయపడిన వెంకటలక్ష్మిని చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గాలివానకు కూలిన విద్యుత్ స్తంభాలు



దొమ్మన్నబావి దగ్గర నేల కూలిన విద్యుత్ స్తంభం

కురబలకోట : మండలంలో బుధవారం రాత్రి గాలి వానకు దొమ్మన్నబావి ప్రాంతంలో లెవన్ కేవీ లైన్‌కు చెందిన మూడు విద్యుత్ స్తంభాలు నేల కూలాయి. వెంటనే విద్యుత్ సరఫరాను ఆపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో పరిసర ప్రాంతాలతో పాటు నాయనబావి వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అంగళ్లలో కూడా విద్యుత్ వైర్లపై కొమ్మలు విరిగి పడటంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. హుటాహుటిన విద్యుత్ పునరుద్ధరణ చర్యలు చేపట్టినట్లు ట్రాన్స్‌కో ఏఈ తెలిపారు.

మహిళలు, చిన్నారుల రక్షణకు శక్తి



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్



శక్తి బృందం ర్యాలీలో పాల్గొన్న మహిళా పోలీసులు

శక్తి బృందం వాహనాలను జెండా ఊపి ప్రారంభించిన జిల్లా ఎస్పీ ఈ.జి. అశోక్ కుమార్

కడప అర్బన్ : మహిళలు, చిన్నారుల భద్రతే లక్ష్యంగా ప్రత్యేకంగా శక్తి బృందాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ ఈ.జి. అశోక్ కుమార్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలు వద్ద బుధవారం శక్తి బృందాలు వినియోగించనున్న 56 ద్విచక్ర వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పెన్నార్ కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శక్తి బృందాలకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రంలో మహిళలపై ఎలాంటి దాడులు, అఘాయిత్యాలు, వేధింపులు లేకుండా చేసేందుకు ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో శక్తి బృందాలను జిల్లాలలో ఏర్పాటు చేశామన్నారు. శక్తి బృందాలు జిల్లాలోని కళాశాలలు, పార్కులు, రద్దీ ప్రదేశాలు, కాలేజీలు, షాపింగ్ మాల్స్, ఆర్టీసీ బస్టాండ్లు, ముఖ్య కూడళ్లలో నిఘా ఉంచాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మహిళలు, పిల్లలపై వేధింపులు అరికట్టడం, నేరాలను నిరోధించడం, తక్షణ సాయం అందించి వారికి రక్షణ కవచంగా నిలిచేలా విధులు నిర్వహించి నేరాల శాతాన్ని తగ్గించాలన్నారు. మహిళలపై వేధింపులు, ఇతర చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే అసాంఘిక శక్తులకు చట్ట ప్రకారం శిక్ష పడేలా చూడాలన్నారు.

నూతనంగా ఏర్పాటు చేసిన 7 బృందాలు : జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో రెండు బృందాలు, కడప సబ్ డివిజన్ -1, మైదుకూరు -1, ప్రొద్దుటూరు -1, పులివెందుల -1 , జమ్మలమడుగు -1 చొప్పున సబ్ డివిజన్లలో విధులు నిర్వర్తిస్తాయన్నారు. ఈ బృందంలో ఎస్ఐ నేతృత్వంలో ఇద్దరు మహిళా సిబ్బంది, ముగ్గురు కానిస్టేబుళ్లు మొత్తం ఆరుగురు సభ్యులు ఉంటారన్నారు. కడప సబ్ డివిజన్‌కు 17, మైదుకూరు సబ్ డివిజన్ కు 15, ప్రొద్దుటూరు సబ్ డివిజన్‌కు 8, జమ్మలమడుగు సబ్ డివిజన్‌కు 9 , పులివెందుల సబ్ డివిజన్‌కు 7 వాహనాలను కేటాయించామన్నారు. అలాగే ఆపద సమయంలో శక్తి యాప్‌నకు వచ్చే ఎస్.ఓ.ఎస్.కాల్స్, డయల్ 112/100 , 181, 1098, 1930 కాల్స్‌కు స్పందించి సంఘటన స్థలానికి ఈ బృందాలు వెళ్తాయన్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు, జిల్లా అదనపు ఎస్పీ (ఏ.ఆర్) బి.రమణయ్య, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఎస్.రమాకాంత్, ఏఆర్ డీఎస్పీ కె.శ్రీనివాసరావు, ఆర్.ఐలు వీరేష్, ఆనంద్, మహిళా పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎల్లమరాజు, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, కార్యవర్గ సభ్యురాలు మాధవీలత, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులను ఖాతరు చేయని సోలార్ ప్రతినిధులు

- యథేచ్ఛగా కొనసాగుతున్న పనులు
- జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన పాపాయపల్లె గ్రామస్తులు

జమ్మలమడుగు : సోలార్ కోసం సేల్ కంపెనీ యాజమాన్యం యథేచ్ఛగా పనులు చేసుకుంటోంది. అధికారులు పరిశీలించేందుకు వెళ్లినా డోంట్ కేర్ అన్నట్లుగా వ్యవహరించడంతో పాటు అధికారులనే మీరెవరు అంటూ ప్రశ్నించడంతో అవాక్కు కావడం వారి వంతైంది. పెద్దముడియం మండలం పాపాయపల్లె గ్రామంలోని 224 సర్వే నంబర్‌లో ఉన్న 500 ఎకరాల భూమిని పశువులమేత కోసం వదిలితే సేల్ కంపెనీ సోలార్ నిర్మాణం కోసం దాన్ని తవ్వేస్తోందంటూ 'ఫారెస్టు ఫర్ సేల్' అనే శీర్షికతో సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు పనులు జరుగుతున్న ప్రాంతానికి సర్వేయర్, వీఆర్‌ఓలతో కలిసి వెళ్లారు. అక్కడ పనులు చేస్తున్న వారు అధికారులను ఏమాత్రం పట్టించుకోకుండా తమ పనులను యధావిధిగా కొనసాగించారు. తాము అధికారులమని చెప్పినా వారు తమకు ఎలాంటి గౌరవం ఇవ్వలేదంటూ అధికారులు వాపోతున్నారు.

జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు..

పశువుల మేతకోసం వదిలిన 500 ఎకరాల భూమిలో సోలార్ కంపెనీ అక్రమంగా పనులు మొదలు పెట్టిందని పాపాయపల్లె గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పశువుల మేత కోసం వదిలిన కొండ ప్రాంతంలో ఉన్న భూమిలో నెమళ్లతోపాటు, జింకలు, కుందేళ్లు వంటి వన్యప్రాణులు ఉన్నాయి. అంతేకాకుండా పశువులకు తాగేందుకు మంచి నీటి కుంట కూడా ఉంది. వీటిని పూర్తిగా సోలార్ కంపెనీ ఆక్రమించి చదును చేస్తోందని ఫిర్యాదు చేశారు.

పశువుల మేత భూమిలో పనులు ఆపకపోతే పోరాటం చేస్తాం..

తమ గ్రామంలో పశువుల మేతకోసం వదిలిన 500 ఎకరాల భూమిని సోలార్ కంపెనీ వారు చదును చేసే పనిలో పడ్డారు. దీనిపై ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి దృష్టికి ఇప్పటికే తీసుకెళ్లామని వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో సోలార్‌కు వ్యతిరేకంగా పోరాటం చేస్తామన్నారు.

వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి



మాట్లాడుతున్న మహిళా కన్వీనర్లు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా జరిగే ఉద్యమాలలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనాలని వక్ఫ్ పరిరక్షణ కమిటీ(జేఏసీ) జిల్లా కన్వీనర్ అహ్మద్ బాబు బాయ్ పేర్కొన్నారు. బుధవారం ఆప్‌కీ ఆవాజ్ రాష్ట్ర కార్యాలయంలో మహిళా కన్వీనర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ భవిష్యత్తులో జరిగే కార్యక్రమాల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. వక్ఫ్ సవరణ బిల్లును ప్రభుత్వం వెనక్కి తీసుకునే వరకు ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు సూచనల ప్రకారం పోరాటాన్ని ఉధృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. వక్ఫ్ పరిరక్షణ కమిటీ జేఏసీ జిల్లా మీడియా ఇన్‌చార్జి మగ్బూల్ బాషా మాట్లాడుతూ త్వరలో మహిళలతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆప్‌కీ ఆవాజ్ నగర ఉపాధ్యక్షుడు ఆబిద్ హుస్సేన్, జేఏసీ కో కన్వీనర్లు రిజ్వానా, మెహనూర్, ఫాతిమా, నిలోఫర్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు అంతర్ జిల్లా బైక్ దొంగలు అరెస్టు

- 27 బైకులు స్వాధీనం
- వివరాలను వెల్లడించిన మైదుకూరు డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్



నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజేంద్రప్రసాద్, ప్రొబేషన్ డీఎస్పీ టి.భవాని

మైదుకూరు : వైఎస్సార్, సత్యసాయి, అనంతపురం జిల్లాల్లో బైకులను దొంగతనం చేస్తున్న ముగ్గురు అంతర్ జిల్లా బైక్ దొంగలను బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 27 బైకులను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయంలో బుధవారం మైదుకూరు డీఎస్పీ జి.రాజేంద్రప్రసాద్ ఈ విషయాన్ని విలేకరులకు వెల్లడించారు. చాపాడు మండలంలోని సీబీఐటీ ఇంజనీరింగ్ కళాశాల వద్ద గత నెల 21న ఓ విద్యార్థికి చెందిన స్కూటీ చోరీకి గురైంది. ఆ మేరకు చాపాడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. దీనిపై ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ ఆదేశంతో మైదుకూరు డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్ ప్రత్యేక బృందాన్ని నియమించారు. ప్రొబేషన్ డీఎస్పీ టి.భవాని, రూరల్ సీఐ జె.శివశంకర్, చాపాడు ఎస్ఐ కె.చిన్న పెద్దయ్యలకు అందిన సమాచారం మేరకు బుధవారం ఉదయం చాపాడు మండలం అల్లాడుపల్లె క్రాస్ రోడ్డు, మైదుకూరు – ప్రొద్దుటూరు జాతీయ రహదారిపై పోలీసులు వాహన తనిఖీని చేపట్టారు. ఆ సమయంలో ముగ్గురు యువకులు మోటారు బైకులపై వస్తూ పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించారు. పోలీసులు వారిని పట్టుకుని విచారించారు. విచారణలో పట్టుబడిన వారు జిల్లాలోని లింగాల మండలం వెలిదండ్ల గ్రామానికి చెందిన కర్ణ పవన్ కుమార్ రెడ్డి, కర్ణ లోకనాథ్‌రెడ్డి, పులివెందుల పట్టణంలోని రాజారెడ్డి కాలనీకి చెందిన గంగిరెడ్డి అశోక్ రెడ్డిగా తేలారు. వీరు బైక్‌లను దొంగిలిస్తుంటారని తెలిసింది. మార్చి 21వ తేదీన సీబీఐటీ కాలేజీ వద్ద స్కూటీని తామే చోరీ చేసినట్లు వారు అంగీకరించారు. మరింత లోతుగా విచారించడంతో సత్యసాయి జిల్లా కదిరి, అనంతపురం జిల్లా తాడిపత్రి, వైఎస్సార్ జిల్లాలోని జమ్మలమడుగు, కడప, ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల, తొండూరు, పులివెందుల పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం 27 బైక్‌లను చోరీ చేసినట్లు వెల్లడించారు. చోరీ చేసిన బైకులను విక్రయించేందుకు వెలిగండ్ల గ్రామంలో దాచి ఉంచినట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో డీఎస్పీ రాజేంద్రప్రసాద్, ప్రొబేషన డీఎస్పీ టి.భవాని నిందితులను, బైకులను చూపించారు. మరో రెండు బైకులను స్వాధీనం చేసుకోవాల్సి ఉందని తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు బైక్ దొంగలను పట్టుకోవడంలో ప్రధాన పాత్ర పోషించిన చాపాడు పోలీసులు వి.బ్రహ్మేంద్ర, మధుసూదన్‌రెడ్డి, సబ్ డివిజన్ క్రైం పార్టీకి చెందిన పోలీసులు తిరుమలయ్య, నవీన్, గణేష్, ప్రసాద్, రాఘవరెడ్డిలను అభినందించి వారికి రివార్డులను అందజేశారు. సమావేశంలో రూరల్ సీఐ శివశంకర్, చాపాడు ఎస్ఐ చిన్న పెద్దయ్య పాల్గొన్నారు.

స్కూటీని ట్రాక్టర్ ఢీకొని మహిళ మృతి



సరోజ మృతదేహం వద్ద రోదిస్తున్న కుమార్తె మౌనిక (ఇన్‌సెట్) సరోజ (ఫైల్)

కమలాపురం : కమలాపురం రైల్వే గేటు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణంలోని రాం నగర్‌కు చెందిన మహిళ మృతి చెందింది. స్థానికులు, పోలీసుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. బుధవారం రాం నగర్‌కు చెందిన సరోజ(48) తన కూతురు మౌనికతో కలసి స్కూటీలో క్రాస్ రోడ్డు నుంచి కమలాపురం పట్టణంలోకి వెళ్తుండగా రైల్వే గేటు వద్దకు రాగానే ప్రమాదవశాత్తు స్కూటీని ట్రాక్టర్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో సరోజ స్కూటీ నుంచి కింద పడింది. ట్రాక్టర్ టైర్ తలపై ఎక్కడంతో సరోజ అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ విద్యా సాగర్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. మృతురాలి కుమార్తె మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా సరోజ మృతి చెందిన విషయం తెలియడంతో రాం నగర్‌లో విషాద ఛాయలు అలుము కున్నాయి.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి



వెంకట జగదీశ్వర్ (ఫైల్)



వేంపల్లె మౌలాలి (ఫైల్)

చింతకొమ్మదిన్నె : కడప–చిత్తూరు జాతీయ రహదారిపై బుగ్గలేటిపల్లె గ్రామం వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వేంపల్లె మౌలాలి(19), వెంకట జగదీశ్వర్ (20) అనే ఇరువురు యువకులు మృతి చెందారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక మూలవంక గ్రామానికి చెందిన వేంపల్లె మౌలాలి, అతని స్నేహితుడు వెంకట జగదీశ్వర్‌తో కలిసి మంగళవారం రాత్రి బుగ్గలేటిపల్లె వద్ద డాబాకు భోజనానికి వెళ్లి తిరిగి ఇంటికి బైకుపై వస్తుండగా విష్ణు విద్యా మందిర్ స్కూల్‌కు వద్ద రాయచోటి వైపు నుంచి కడపకు వస్తున్న బొలెరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో బైకుపై ప్రయాణిస్తున్న వేంపల్లె మౌలాలి, వెంకట జగదీశ్వర్‌లు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. వెంకట జగదీశ్వర్ అప్పటికే చనిపోయాడని వైద్యులు నిర్ధారించారు. వేంపల్లె మౌలాలి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం వారి మృతదేహాలను బంధువులకు అప్పగించారు. దీంతో మూలవంక గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. వెంకట జగదీశ్వర్ బెంగళూరులో బీబీఏ చదువుతున్నాడు. తండ్రి కరోనా కాలంలో మృతి చెందాడు. ఏకైక కుమారుడు కావడంతో తల్లి, అక్క హృదయవిదారకంగా విలపించారు. మౌలాలి బీకాం చదువుతూ పారిశ్రామిక సంస్థలో విధులు నిర్వహిస్తున్నాడని సమాచారం.

నిర్ణీత గడువులోగా రైల్వే అభివృద్ధి పనులు



మ్యాప్‌ను పరిశీలిస్తున్న గుంతకల్లు డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా, తదితరులు

కడప కోటిరెడ్డి సర్కిల్ : అమృత్ భారత్ పథకంలో భాగంగా కడప రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రైల్వే గుంతకల్లు డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా ఆదేశించారు. బుధవారం కడప రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కడపలో ఏయే పనులు, ఎంత మేరకు పూర్తయ్యాయో సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మ్యాప్‌ను పరిశీలించి ఆయా పనుల గురించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న ఈ పనులను డిసెంబర్‌లోగా పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఆ దిశగా అధికారులు పనులను పర్యవేక్షించాలని సూచించారు. నాణ్యత పరంగా రాజీ లేకుండా చూడాలని, ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గుంతకల్లు సీనియర్ డీసీఎం ఎస్.మనోజ్, సీనియర్ డీఈఈ యల్లయ్య, సీనియర్ డీఈఎన్ అభిరాం, కడప రైల్వే స్టేషన్ మేనేజర్ శేఖర్ కుమార్, సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్, ఆర్‌పీఎఫ్ సీఐ కోటేశ్వరరావు, ఏడీఎన్ రాధాకృష్ణ, తదితర అధికారులు పాల్గొన్నారు.

అమృత్ భారత్ స్కీం పనులను వేగవంతం చేయాలి

గుంతకల్లు రైల్వే డివిజనల్ మేనేజర్ చంద్రశేఖర్‌గుప్త



గంతకల్లు డీఆర్‌ఎంకు సమస్యలను విన్నవిస్తున్న డీఆర్‌యూసీసీ సభ్యుడు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి

రాజంపేట : రాజంపేట రైల్వే స్టేషన్‌లో అమృత్ భారత్ స్కీం కింద జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని గంతకల్లు డివిజన్ రైల్వే మేనేజర్ చంద్రశేఖర్‌గుప్తా ఆదేశించారు. బుధవారం రాత్రి రాజంపేట రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను డీఆర్‌ఎం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సంబంధిత అధికారుల పర్యవేక్షణలో జరుగుతున్న పనుల తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పన దిశగా జరుగుతున్న అభివృద్ధి పనులను ఎప్పటికి పూర్తి చేస్తారని ప్రశ్నించారు. రైల్లో బోగీలకు సంబంధించి డిస్‌ప్లే బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. వెయిటింగ్ హాల్, స్టేషన్ బయట జరుగుతున్న పనుల నిర్మాణ దశలపై ఆరా తీశారు. డీఆర్‌ఎంతో పాటు సీనియర్ డీసీఎం మనోజ్, ఏడీఎన్ అహ్మదుల్లా, పలువురు డివిజన్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

డీఆర్‌ఎం దృష్టికి పలు సమస్యలు..

రాజంపేట రైల్వే స్టేషన్‌లో ప్రత్యేకంగా పార్సిల్ కేంద్రాన్ని పునరుద్ధరించాలని గంతకల్ డివిజనల్ రైల్వే యూజెస్ కమిటీ సభ్యుడు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి కోరారు. డీఆర్‌ఎం రాజంపేటకు వచ్చిన సందర్భంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రాజంపేట రైల్వే స్టేషన్‌లో పార్సిల్ కేంద్రం ఉండటం వల్ల ఈ ప్రాంత రైతుల ఉద్యాన వన ఉత్పత్తులకు దోహద పడుతుందన్నారు. ఇందుకు డీఆర్‌ఎం సానుకూలంగా స్పందించారు. పలురైళ్లు హాల్టింగ్ అంశాన్ని మరోసారి డీఆర్‌ఎం దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో సీనియర్ డీఈఈ యల్లయ్య, సీనియర్ డీఈఎన్ అభిరామ్, కడప సీసీఐ జనార్దన్, రాజంపేట రైల్వే స్టేషన్ మేనేజర్ గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అరుదైన శస్త్ర చికిత్సతో ప్రాణాలు పోశారు



ప్రభుత్వ ఆస్పత్రిలో ఆపరేషన్ చేసిన తరువాత మీడియా సమావేశం నిర్వహిస్తున్న వైద్య బృందం



రాయచోటి పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర మల్టీ స్పెషాల్టీ ఆస్పత్రిలో బాలుడికి వైద్యం చేస్తున్న డాక్టర్లు

రాయచోటి టౌన్ : ఒకప్పుడు రాయచోటిలో చిన్న పాటి చికిత్స చేయాలన్నా సరైన వైద్య నిపుణులు లేక తిరుపతి, కడప లాంటి ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి. అయితే ఇప్పుడిప్పుడే రాయచోటిలో కూడా కార్పొరేట్ స్థాయిలో శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహిస్తున్నారు. గత వైఎస్ జగన్ ప్రభుత్వంలో రాయచోటి పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిని 100 గదుల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయడంతో పాటు కార్పొరేట్ స్థాయిలో దాదాపుగా రూ.25కోట్లు ఖర్చు చేసి పెద్ద భవనాలు నిర్మించారు. అందుకు తగ్గట్టుగానే వైద్యులను నియమించడంతో అరుదైన శస్త్ర చికిత్సలు చేస్తూ పేదలకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో..

గాలివీడు మండలానికి చెందిన శృతి అనే పేద మహిళ మొదటి కాన్పు సమయంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొంది. చివరికి శస్త్ర చికిత్స ద్వారా మొదటి కాన్పు జరుపుకొంది. ఆ సమయంలో ఆ సమయంలో ఏమి జరిగిందో తెలియదు కానీ మలం, మూత్రం రెండు ఒకే దారిలో రావడం మొదలయ్యాయి. దీనిని రెక్టో వేజైనల్ ఫిస్టులా అంటారు. అసలే పేద కుటుంబం కావడంతో కార్పొరేట్ ఆస్పత్రికి వెళ్లి శస్త్ర చికిత్స చేయించుకోలేక తీవ్ర మనోవేదనను అనుభవించింది. ఈ క్రమంలో పది రోజుల క్రితం రెండవ కాన్పు కోసం రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తన తల్లితో కలసి వచ్చింది. ఈ విషయం ఆస్పత్రి వైద్యుల దృష్టికి తీసుకెళ్లింది. సాధారణ కాన్పు చేసిన వైద్యులు తరువాత ఆమెకు ఉన్న పెద్ద సమస్యను కూడా గుర్తించారు. గైనకాలజిస్ట్ డాక్టర్ జీనత్ బేగం, శస్త్ర చికిత్స నిపుణుడు డాక్టర్ లక్ష్మీప్రసాద్, అనస్థీషియా డాక్టర్, ఇతర వైద్యులు కలిసి చర్చించారు. ఆమెకు ఉన్న సమస్యను పరిష్కరించాలంటే ఆపరేషన్ ఒక్కటే మార్గమని తీర్మానించారు. అందుకు ఆమె అంగీకారం తీసుకుని వెంటనే ఆమెకు డాక్టర్ లక్ష్మీప్రసాద్, డాక్టర్ జీనత్ బేగం, డాక్టర్ బండారు కిరణ్‌కుమార్, డాక్టర్ శివ, డాక్టర్ అజాజ్ అహమ్మద్‌తో కలసి ఆపరేషన్ చేశారు.

శ్రీ వెంకటేశ్వర ఆస్పత్రిలో...

రాయచోటి పట్టణంలోని మదనపల్లె రోడ్డులో శ్రీ వెంకటేశ్వర మల్టీ స్పెషాల్టీ ఆస్పత్రిలో ఒకే రోజు రెండు ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహించి ప్రాణదానం చేశారు. గాలివీడుకు చెందిన బాలుడు నీటి కుంటలో పడిన సమయంలో ఊపిరి ఆడక పోవడంతో పాటు అదే సమయానికి గుండెకు ఆక్సిజన్ అందకపోవడంతో గుండె పోటు వచ్చింది. స్థానికులు గమనించి రాయచోటికి తరలించారు. శ్రీ వెంకటేశ్వర మల్టీ స్పెషాల్టీ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర రెడ్డి స్పందించి ఆపరేషన్ చేసి బాలుడి ప్రాణాలను కాపాడారు. అలాగే మంగళవారం రాత్రి ఒక మధ్య వయస్సు వ్యక్తి కంటి కింద దవడ భాగం తీవ్రంగా బాధిస్తోందని చెప్పడంతో స్కానింగ్ చేసి బ్లాక్ ఫాక్స్ ఉన్నట్లు నిర్ధారించారు. వెంటనే హైదరాబాద్‌కు చెందిన స్పెషలిస్ట్ డాక్టర్ల సలహా మేరకు వారి పర్యవేక్షణలో ఆపరేషన్ చేసి దవడ ఎముక తొలగించి దాని స్థానంలో మరొకటి అమర్చారు.

ప్రభుత్వ స్థలంలో రాళ్లు పాతిన కేసులో ఆరు నెలల జైలు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని టి.సదుం పంచాయతీ రేకులగుంటిపల్లికి చెందిన శీత వెంకట్రమణారెడ్డి అనే వ్యక్తి 2015లో ప్రభుత్వ స్థలంలో వీధికి అడ్డంగా రాళ్లు నాటాడు. అప్పట్లో గ్రామస్తుల ఫిర్యాదు మేరకు అప్పటి పంచాయతీ వీఆర్‌ఓ వెంకట్రమణ అలియాస్ రమణ గ్రామానికి వెళ్లి విచారించి ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నాటిన రాళ్లను తొలగించాలని వెంకట్రమణారెడ్డికి సూచించారు. అయితే ఆక్రమణదారుడు ప్రభుత్వ అధికారి ఆదేశాలను సైతం బేఖాతరు చేయడమే గాక వీఆర్‌ఓపై దౌర్జన్యం చేస్తూ బెదిరించాడు. ఈ విషయంపై బాధిత వీఆర్‌ఓ ఫిర్యాదు మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో కేసు తుది విచారణకు రావడంతో బుధవారం తంబళ్లపల్లి కోర్టు ఏపీపీ వీరాంజనేయులు కేసు వాదోపవాదాలను న్యాయమూర్తికి వినిపించారు. ఈ తరుణంలో కేసు పూర్వాపరాలు పరిశీలించిన తంబళ్లపల్లి కోర్టు న్యాయమూర్తి ఉమర్ ఫారూక్ నేరం రుజువు కావడంతో నిందితుడు వెంకట్రమణారెడ్డికి ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారని ఎస్ఐ హరిహర ప్రసాద్, కోర్టు కానిస్టేబుల్ బావాజాన్ తెలిపారు.